GLOBAL TELUGU CHRISTIAN MINISTRIES

# NEWS LETTER

For Private Circulation only

May - June 2016

***ప్రపంచ వ్యాప్తంగా విస్తరించివున్న ప్రియమైన జీటీసీయెమ్మర్స్,***

మహా పరిశుద్ధుడు, మహోన్నతుడునైన యేసుక్రీస్తు నామంలో జీటీసీయెమ్ మరో మారు మీకందరికీ శుభాలు తెలియజేసుకొంటోంది. మీ గృహాల్లోనూ, సంఘాల్లోనూ క్షేమం కోరి ప్రార్థిస్తోంది. మండు, పండు వేసవి సుమారుగా గడిచిపోయింది. గ్రీష్మ తాపానుభవాలు ఇంకా మనలను భయపెడుతూనే వున్నాయ్. అక్కడక్కడా పడుతోన్న వర్షాలు ప్రాణాలను తెప్పరిల్లజేస్తోన్నాయి. మనల్ని తన రెక్కల నీడను భద్రపరచిన దేవునికి స్తోత్రాలు!

ఈ సంవత్సరం ఏప్రిల్ పదకొండో తేదీన సికింద్రాబాద్‌లో జరిగిన వార్షిక బోర్డ్ మీటింగ్‌లో ఆంధ్రప్రదేశ్ బైబిల్ సొసైటీ అక్జిలరీ సెక్రటరీగా పని చేసిన రెవరెండ్. డా. ఎన్.ఎల్. విక్టర్ గారూ, ఆరాధనా టీవీ వ్యవస్థాపకులు డా. పాల్ దేవప్రియంగారి సతీమణి శ్రీమతి ఉషా పాల్ గారు బోర్డ్ ఆఫ్ జీటీసీయెమ్ గవర్నర్స్‌గా నియమితులయ్యారు. వీరిరువురి సేవా అనుభవాలు జీటీసీయెమ్ పరిచర్యలను ముందుకు నడిపించడంలో ఎంతో ఉపయుక్తంగా వుంటాయని నాయకత్వం ఆశిస్తోంది. రెవరెండ్ డా. జోసఫ్ పాతూరి గారిని తన తదనంతరం ప్రెసిడెంట్ గా రెవరెండ్ డా. లివింగ్‌స్టన్ గారు ప్రకటించారు. ఇది జీటీసీయెమ్ సేవను అభివృద్ధి పథంలో కొనసాగించే దిశగా డా. లివింగ్‌స్టన్ గద్దె గారు దైవాత్మ ప్రేరితులై తీసుకొన్న చారిత్రాత్మక నిర్ణయంగా భావించబడుతోంది. డా. లివింగ్‌స్టన్ గద్దె గార్కి, డా. జోసఫ్ పాతూరి గార్కి శుభాభినందనలు.

జీటీసీయెమ్ ఒక ప్రపంచ వ్యాప్త పరిచర్య కలిగిన సంస్థగా రూపుదిద్దుకొన్న నాటి నుండి ఎల్లలు లేని ప్రపంచ వ్యాప్త తెలుగు క్రైస్తవులను సమైక్యపరచి, మన సంఘాల్లో శాఖాపరమైన బేధాలు లేకుండా సౌభ్రాతృత్వంతో క్రీస్తుని ప్రకటించే పనిలో ముందుకు సాగాలని తన ధ్యేయాన్ని క్రియాశీలకంగా ప్రకటిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించియున్న తెలుగు క్రైస్తవులను ప్రభువు మహా ఆజ్ఞ నెరవేర్పు దిశగా సంఘటిత పరచి నడిపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు క్రైస్తవుల మధ్య సంఘీభావాన్ని సాధించి వారున్న ప్రదేశంలోనే సౌవార్తీకరణకు ఉద్యమించే విధంగా పురికొల్పుతూ, ఈ దృక్పథంలో క్రీస్తుకు, తెలుగు క్రైస్తవులకు మధ్య సమైక్యతను సమకూర్చే వారధిగా వర్ధిల్లుతోంది.

రెండు సంవత్సరాలకోసారి గ్లోబల్ తెలుగు క్రిస్టియన్ కాన్ఫరెన్స్ పేరుతో కార్యక్రమాలు జరిపిన యీ సంస్థ ప్రస్తుతం సంవత్సరానికోసారి వివిధ దేశాల్లో డబ్ల్యూటీసీయెస్, అనగా 'వల్డ్ తెలుగు క్రిస్టియన్ సమిట్, అనే పేరుతో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సెస్ జరుపుతోంది. 2014లో అమెరికాలో 350 మందితోనూ, 2015లో చారిత్రాత్మకమైన కార్యక్రమంగా జెరుసలేంలో 200 మందితోనూ కాన్ఫరెన్సులు జరిపింది. ఇప్పటివరకు ఈ కాన్ఫరెన్సులకు దక్షిణ అమెరికా తప్ప మిగిలిన ఖండాలన్నీ ప్రాతినిధ్యం ప్రకటించుకొన్నాయి.

ప్రభువు కృపా చిత్తంలో ఈ సంవత్సర అక్టోబర్ మాసంలో 28, 29, 30 తేదీల్లో డబ్ల్యూటీసీయెస్ లండన్‌లో జరపడానికి సన్నాహాలు జరుగుతోన్నాయని మీరెరుగుదురు. వచ్చే సంవత్సరం ఆస్ట్రేలియాలోని సిడ్నీ లోనూ ఈ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయడానికి ప్రార్థనలూ, ప్రయత్నాలూ జరుగుతోన్నాయి. ఇవి కాక గతంలో రీజనల్ కాన్ఫరెన్సెస్ షార్జాలోనూ, పోర్ట్ బ్లెయిర్ లోనూ కూడా జరిగాయి. అలానే 2016 – 17 సంవత్సరాల్లో రీజనల్ కాన్ఫరెన్సెస్ యునైటెడ్ ఏరబ్ ఎమిరేట్స్‌లోనూ, ఒమన్ దేశంలోని సలాలా లోనూ, సౌత్ ఈస్ట్ ఏషియన్ కంట్రీస్ లోనూ, పోర్ట్ బ్లెయిర్ లోనూ జరపడానికి సన్నాహాలు జరుగుతోన్నాయి. ఈ కార్యక్రమాల్లో మీ ప్రార్థనా సహకారాన్ని, ప్రాతినిధ్య సహకారాన్ని జీటీసీయెమ్ అభిలషిస్తోంది.

**మీటింగ్స్ న్యూస్ :** ఏప్రిల్ 26వ తేదీ రాజమండ్రి లోని రెవ. థామస్ ఆచారి గారి సంఘంలో 'ఆరోగ్యవంతమైన సంఘం' సెమినార్ జరిగింది. నేను, రెవ. పెర్సి హైరమ్స్ గారు వాక్య పరిచర్య చేసాము. రెవ. థామస్ ఆచారి గారి సహకారానికై కృతజ్ఞతలు. పశ్చిమ గోదావరి జిల్లా బుధారాయుడి చెర్వు గ్రామంలో మే 9వ తేదీ రాత్రి జరిగిన సభలోనూ, 10వ తేదీన కోనసీమ మెరక పాలెం గ్రామంలో శ్రీమతి సెల్మా సుహాసినీ రూఫస్ మెమోరియల్ మందిరంలో జరిగిన పాస్టర్స్ & లీడర్స్ సెమినార్‌లోనూ, ఆ రాత్రి అదే మందిరం వెలుపల జరిగిన బహిరంగ సభలోనూ

డా. లివింగ్‌స్టన్ గద్దె గారూ, నేనూ, జీటీసీయెమ్ 'డైరెక్టర్ ఆఫ్ అడ్వాన్స్ మెంట్' రెవ. పెర్సీ హైరమ్స్ గారూ, పెఫ్ కాక్ మినిస్ట్రీస్ డైరెక్టర్ ఆఫ్ మిషన్స్ బ్రదర్ జి. జయరాజ్ గారూ వాక్య పరిచర్య చేయడానికి ప్రభువు సహాయం చేసారు. ఈ కార్యక్రమాలు చాలా దీవెనకరంగా జరిగినందుకు దేవుని స్తుతిస్తూన్నాం.

మే నెల ఏడో తేదీన విశాఖపట్నం వై.ఎం.సి.ఏ.లో గతంలో ఏర్పాటైన జీటీసీయెమ్ విశాఖపట్నం కమిటీ పునరుజ్జీవింపబడింది. దీనికి కృషి చేసి సహాయపడిన వారు జీటీసీయెమ్ పూర్వ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ మెంబర్ & ట్రెజరర్ ప్రొఫెసర్ వి. అబ్రహాం గారు. వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

మే నెల పన్నెండో తేదీన విజయవాడ ఇన్నోటెల్ హోటల్‌లో కృష్ణాజిల్లా క్రిస్టియన్ లీడర్స్ మీట్ ఫలభరితంగా జరిగింది. రెవరెండ్ జోసఫ్ మోజెస్ గారు మా అభ్యర్థనను గౌరవించి శ్రమ తీసుకొని, అనేకమంది క్రైస్తవ నాయకులను ఆహ్వానించి కార్యక్రమానికి దోహదపడ్డారు. వారికి నా కృతజ్ఞతలు.

ఈ కార్యక్రమాలన్నిటిలోనూ మన అధ్యక్షులకు దేవుడారోగ్యాన్నిచ్చి ఓపికతో పాల్గొనడానికి కృపనిచ్చినందుకు దేవునికి స్తోత్రాలు.

జీటీసీయెమ్ ఇప్పటి వరకూ అనేక గ్రంథాలు ప్రచురించింది. క్రైస్తవ సాహిత్య గ్రంథ ప్రచురణ సువార్త వ్యాప్తికి, ఆత్మీయ అభివృద్ధికి ఒక బహుళార్థమైన సాధనంగా గుర్తించి ఇప్పటి వరకు 19 గ్రంథాలు తెలుగు క్రైస్తవ లోకానికందించింది. వీటిలో జి.ఆర్.క్రో గారి 'పవిత్రగ్రంథ వ్యాఖ్యానం', డా. దాస్ బాబు గారి 'ఆంధ్రక్రైస్తవ కీర్తనలు – కవుల చరిత్ర, కీర్తనల సందేశం', డా. జోసఫ్ పాతూరి గారి 'క్రైస్తవ వేదాంత శాస్త్రము'తో పాటు 'బాలల బైబిల్' కూడా వున్నాయి.

**బిల్డింగ్ నిర్మాణం న్యూస్:** డా. లివింగ్‌స్టన్ గద్దె గారు గుంటూరులో జీటీసీయెంకు బహూకరించిన స్థలంలో ఆఫీసు, సెమినారు హాల్స్ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతోన్నాయి. గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ 'బిల్డింగ్ ప్లాన్' అప్రూవ్ చేసింది. నిర్మాణ దిశగా అడుగువేయడానికి ఆర్థిక బలం ఆవశ్యం. ప్రార్థిస్తారనీ, ప్రశంసిస్తారనీ, పార్ట్నర్స్ ఔతారనీ జీటీసీయెం ఆశ. మీరెలా సహకరించగలరో త్వరలోనే తెలియజేస్తాం.

ఈ విధంగా ఈ సంస్థ వివిధ విధాల చేస్తోన్న పరిచర్యా శ్రమను గుర్తిస్తోన్న మీరు మరెక్కువ ప్రార్థనా సహకారాన్ని అందించగలరని జీటీసీయెం ఆశిస్తోంది.

ప్రభువు సేవలో ... ***ప్రియనాథ్ రూఫస్***



# ఈ మాసం గ్రాసం

రోమా 12:1లో పౌలు రాస్తోన్నాడు: “కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి.”

‘పని’, ‘సమర్పణ’ – ఈ రెంటిలో ఏది ముందు జరగాలి? సమర్పణ లేని పనికి ఆశీర్వాదాలుండవు. పనిమాత్రం జరుగుతుంది. అందుచేత మన పని సమర్పణతో కూడినదై యుండాలి. చాలా మిషన్ సంస్థల్లో పని చేసేవారు (అంటే మనలో అనేకమందిమి) వారి పనిని పరిచర్యగా కాక కేవలం ఉద్యోగం (భృతి) గా మాత్రమే భావిస్తూ వుంటారు. వీరు జీవనోపాధికొరకు పని చేస్తూ ‘పరిచర్యలో భాగస్థులుగా’ భావించుకొంటూ వుంటారు. పరిచర్యనూ, ఉద్యోగాన్నీ ఒకే మూసలో వేయకూడదు. భృతి కొరకు పరిచర్యలో భాగస్వాములయ్యేవారు భృతికే ప్రాధాన్యత నివ్వడం వలన వారిలో పరిచర్యాభావం ప్రారంభంలో వున్నప్పటికీ క్రమంగా అంతరించి పోతుంది. అంటే సమర్పణ లేని పరిచర్య అవుతుంది. కొందరు జీతం పుచ్చుకొంటున్నాం గనుక న్యాయంగా, నీతిగా పనిచేయాలనే భావన కలిగి వుంటారు. న్యాయంగానూ నీతిగానూ పని చేయడమనేది మతానికీ, సమర్పణకూ సంబంధించిన సూత్రం కాదు. మతంతో ప్రమేయం లేకుండా నీతిగానూ, న్యాయంగానూ ఎవరైనా వుండొచ్చు. క్రైస్తవ్యంలో క్రీస్తుని అనుకరించి పనిచేయడం – అంటే సమర్పణతో కూడిన విధంగా పనిచేయడం ప్రాముఖ్యం. ‘త్యాగం లేకుండా సమర్పణ వుండదు’ అనే అవగాహన కూడా కలుగుతుంది గనుక త్యాగపూరితంగా పనిచేయాలి. “Work to Rule” సిద్ధాంతం దీనికి వర్తించదు.

సొలొమోను (ప్రసంగి 9:10) “చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనినైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము” అంటాడు. ఇది మిషన్స్ పరిచర్యల కొరకు చెప్పింది కాదు. ఏ పనైనా, బోత్ మిషన్స్ ఎండ్ సెక్యులర్, పనిని శక్తిలోపము లేకుండానే చేయాలి. ఎంచేతనంటే పని చేసేవాడు ప్రధమంగా భృతి కల్పించిన వాని కొరకు కాక దేవుని కొరకు, అంటే “దేవుని కృపను బట్టే పని లభించింది” అనే స్పృహతో ఆయనను మెప్పించడానికి చేయాలి. అలా చేసేటప్పుడు నీ పని దేవునీ, యజమానినీ మెప్పించేదౌతుంది. దీవెనెలకు యోగ్యమైనదిగా స్వీకరించబడుతుంది.

స్వార్థం కొరకు దేవుని సేవ చేయడం దేవునికి బొత్తిగా నచ్చదు. పాపుల్ని కూడా ప్రేమించే దేవుడు స్వార్థం కొరకు సమర్పణ, త్యాగ బుద్ధి లేకుండా పనిచేసే శాస్త్రులను, పరిసయ్యులను ‘సున్నం కొట్టిన సమాధుల’న్నాడు. వ్యక్తులను, వ్యక్తిత్వాలనూ ప్రదర్శించుకొనే సేవకులమైతే ఈ కోవలోనికి వచ్చేస్తున్నామనే స్పృహ, భయం మనకు కలగాలి. “Those who live in galss houses should not throw stones at others” అనే సత్యం మనమెరుగుదుం. అంటే సమర్పణ, త్యాగం గూర్చి బోధించే మనం ‘వ్యక్తి ప్రదర్శన (self Popularity) కొరకు ఏమీ చేయకూడదు; స్వార్థం కొరకు ఏమీ చేయకూడదు; ట్రిక్కులూ, జిమ్మిక్కులూ ప్రదర్శించకూడదు – అనే సత్యాలు మనకవసరం. దీన్నే పౌలు “కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడి” అంటున్నాడు. “వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి” అని యాకోబు కూడా చెబుతున్నాడు (1:22).

ఆలోచిదాం! సరిచేసుకొందాం!! వాక్యాన్ని బ్రతుకులో సాధన చేయడానికుపక్రమిద్దాం!!! ప్రభువుకు ప్రీతికరమైన పనిచేద్దాం.

---

# బైబిల్ కాలం తర్వాత ఇశ్రాయేల్ చరిత్ర (గత సంచిక తరువాయి)

ప్రియనాథ్ రూఫస్, రాజమండ్రి

## 9. బ్రిటిష్ కాలం (1917-1948)

ఏప్రిల్ 6, 1917లో అమెరికా కూడా మొదటి ప్రపంచ యుద్ధంలో కాలు పెట్టింది. జూలై నెలలో బ్రిటిష్ ఆర్మీ జనరల్ సర్ ఎడ్మండ్ అలెన్బీ సంయుక్త దేశాల కమాండర్‌గా అప్పాయింట్ అయ్యాడు. నవంబర్ 16న జాఫ్ఫా సిటీని అలెన్బీ హస్తాగతం చేసుకొన్నాడు. డిసెంబర్ ఎనిమిదో తేదీన బ్రిటిష్ బలగాలు జెరూసలేం చేరుకొన్నాయి. ఆ సమయంలో యూదులు హనుక్కా పండుగ జరుపుకొంటున్నారు. క్రీ.పూ. 165లో మక్కబీ సోదరులు జెరూసలేంకు విడుదల కలిగించిన దినమది. తొమ్మిదో తేది ఆదివారం తెల్లారేసరికి టర్కులు పలాయనం చిత్తగించడం ప్రారంభమైంది. ఒక్క తూటాకూడా ఎవరూ కాల్చలేదు. డిసెంబర్ 11న అలెన్బీ అధికారికంగా జాఫ్ఫా గేట్ నుండి జెరూసలేం లోనికి ప్రవేశించాడు.

దీనికి పూర్వమే ఇంగ్లండ్ లో చోటుచేసుకొన్న కొన్ని పరిస్థితుల్ని ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి. ప్రపంచ యుద్ధంలో ది ఫస్ట్ లార్డ్ ఆఫ్ ది ఎడ్మిరాలిటి విన్స్టన్ చర్చిల్ కి ఒక ఆలోచన తట్టింది. డాక్టర్ చైం వీజ్మన్ అనే యూద సైంటిస్ట్ ని కాంటాక్ట్ చేసి యుద్ధంలో అవసరమైన మందుగుండు సామాగ్రిలో వినియోగించే ఎసెటన్ కెమికల్ లభ్యంకావడంలేదు గనుక మరో విధంగా ఎసెటన్ తయారుచేసే మార్గం పరిశోధించమని అభ్యర్థించాడు. మొక్కజొన్నను నానబెట్టి ఎసెటన్ తయారుచేసే విధానం వీజ్మన్ కనిపెట్టాడు. దీనినుపయోగించి యుద్ధంలో సంయుక్త దేశాల కూటమి విజయం సాధించింది. దీనికి తగిన విధంగా వీజ్మన్ ను గౌరవించాలనుకొంది. వీజ్మన్ తన స్వార్థం కొరకు ఏమీ కోరక దేశంలేని కాందిశీకులుగా బ్రతుకుతోన్న తన ప్రజలకు పలేస్తీన్ ఇప్పించాల్సిందిగా కోరాడు. వీజ్మన్ కోరిక మేరకు బ్రిటిష్ ప్రభుత్వం స్పందించింది. బ్రిటిష్ ఫారిన్ సెక్రటరీ అర్థర్ బాల్ఫోర్ నుంచి ఇంగ్లండ్ లో యూద నాయకుడు సర్ రాత్స్ చైల్డ్ కు ఒక లేఖ వచ్చింది. దీన్నే చరిత్రలో బాల్ఫోర్ డిక్లరేషన్

అంటారు. ఈ లేఖలో సారాంశం: పలేస్తీన్‌లో నివసిస్తోన్నా ప్రజలెవ్వరి సామాజిక, మతపరమైన హక్కులకూ, భద్రతకూ ఆటకం కలుగని విధంగా యూదులకు ఒక స్వతంత్ర దేశాన్ని ఏర్పాటుచేయడానికి బ్రిటిష్ చక్రవర్తి ప్రభుత్వం సమ్మతించింది. ఈ నిర్ణయానికి అనేక సంయుక్త దేశాలూ, అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్ తమ సమ్మతిని తెలియజేశారు. ఆ విధంగా తమకంటూ ఒక దేశాన్ని సంపాదించుకొన్న యూదప్రజలు తమ కృతజ్ఞత వీజ్మన్‌కు తెలియజేయాలనుకొన్నారు. స్వతంత్ర రాజ్యం జనించిన మూడోరోజు అంటే 1948 మే పదిహేడో తేదీన చైం వీజ్మన్ ను తమ దేశానికి ప్రధమ అధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. అమెరికాలో వున్న వీజ్మన్ కు ఈ వార్త అందింది.

ఈ నిర్ణయ కార్యాచరణలో భాగంగా 1920 జూన్ ముప్ఫయ్యవ తేదీన సర్ హెర్బర్ట్ సేమ్యూల్ అనే యూదుడు బ్రిటిష్ హై కమిషనర్‌గా జెరూసలేం పంపబడ్డాడు. హెర్బర్ట్ సేమ్యూల్ సంపూర్తిగా తెల్లని వస్త్రధారణతో, తలమీద హెల్మెట్ కూడా తెల్లనిది ధరించి, క్రీస్తు పూర్వం 587లో యూదుల చివరి రాజైన జెదికియా తర్వాత అధికారికంగా విధులు నిర్వహించడం ప్రారంభించాడు. అంటే యూదుల స్వయం పరిపాలన అంతమైన 2500 సంవత్సరాల తర్వాత యూదులు జెరూసలేం లో అధికారాన్ని కలిగివుండడం ప్రారంభమైంది. నిజానికి ప్రారంభంలో ఈ నిర్ణయం విద్యాధికులైన అరబ్బులకేమాత్రం అసమ్మతంగా లేదు. అప్పటి అరబ్బుల తరపున నాయకుడైన అమీర్ ఫైసల్ అమెరికాలో జయనిస్ట్ మూవ్మెంట్ నాయకుడు ఫెలిక్స్ ఫ్రేంక్ ఫర్ట్ కు 1919 మార్చ్ మూడవ తేదీన రాసిన ఉత్తరం యిలా వుంది. “జయనిస్ట్ మూవ్మెంట్ గూర్చి అరబ్బులమైన మేము, మరి ముఖ్యంగా విద్యాధికులమైన మేము మా సానుభూతిని తెలుపుతోన్నాం. నిన్న పారిస్ లో జరిగిన శాంతి కమిటీకి జయనిస్ట్ మూవ్మెంట్ సమర్పించిన అంశాలు అంగీకారయోగ్యమైనవిగా నున్నాయని మేం గుర్తిస్తోన్నాం. ఈ క్రమంలో మేం అందించగలిగిన సహకారాన్ని అందిస్తామని తెలియజేస్తూ పలేస్తీనుకు యూదులను హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తోన్నాం. అరబ్బులూ, యూదులూ పరస్పర సహకారులుగా నుండకుండా మనమేమీ సాధించలేమని భావిస్తోన్నాం”. కానీ ప్రపంచ రాజకీయాలమీద పట్టుకోల్పోయి బలహీనపడిపోయిన బ్రిటిష్ ప్రభుత్వం క్రమేణా అరబ్బులకూ, యూదులకూ చేసిన వాగ్దానాలు నిలబెట్టుకోకపోవడమే సమస్యలను సృష్టించింది.

1929 లో జెరూసలెం వెయిలింగ్ వాల్ వద్ద అనేకమంది యూదులు అరబ్బులచే చంపబడ్డారు. అరబ్బులకు ప్రాముఖ్యమైన డోమ్ ఆఫ్ రాక్ నూ, అక్సా మసీదునూ కూల్చివేసి వాటి స్థానే తమ దేవాలయాన్ని నిర్మించడానికి యూదులు కుట్రపన్నుతోన్నారని ఎవరో పుట్టించిన పుకారే దీనికి కారణం. దీనికి తోడు మిడిల్ ఈస్ట్‌లో ఎక్కడా లేని విధంగా అరబ్ కూలీలకు యూదులు అధికమైన కూలీ ఇవ్వడం అరబ్ వ్యాపారులలో ఆందోళనను పుట్టించింది. హోలీ లేండ్ సమస్యను అధ్యయనం చేసి సిఫారుసులు చేయడానికి 1936 లో ఇంగ్లండ్ నుండి లార్డ్ ఫీల్ నాయకత్వంలో ఒక కమిటీ పంపబడింది. వీరి సిఫారుసులను యూదులు అంగీకరించారు కానీ అరబ్బులు కనీసం వినడానికి కూడా ఇష్టపడలేదు. ఇంతలో రెండవ ప్రపంచ యుద్ధ సంకేతాలు యూరప్ లో షికారు చేస్తోన్నాయి. బ్రిటిష్ వారు నాజీలతోనూ, ముస్లీమ్‌లతోనూ యుద్ధానికి ఇష్టపడలేదు. గనుక అరబ్బులను శాంతింపజేయడానికి బ్రిటిష్ వారు ఒక శ్వేత పత్రాన్ని (White Paper) విడుదల చేశారు. వైట్ పేపర్ సిఫారసులిలావున్నాయి. 1. యూదుల సంఖ్యని 30 శాతానికి కుదించడం. 2. భూమి కొనుగోలులో యూదులకు పరిమితులు నియమించడం. ఈ సిఫారసులు అరబ్బులకు అనుకూలంగా వున్నప్పటికీ యూదులకు మాత్రం చేదుమందు లాగా అనిపించింది. ఊహించినట్లుగానే జర్మన్ మిలిటరీ పోలెండ్ ను స్వాధీనపరచుకొంది. రెండవ ప్రపంచ సంగ్రామం ఆరంభమైంది. ***(సశేషం)***

## డబ్ల్యూటీసీయెస్ - లండన్ 2016

### 2016 అక్టోబర్ 28, 29, 30

**WTCS LONDON 2016** గూర్చిన వివరాలకు ఈ ఫోన్ నంబర్స్ ను సంప్రతించండి:

**Mr. BENJAMIN SAMUEL, Office Manager Ph : 09866083001, email: benjamin.gtcm@yahoo.com**
**Mr. PRAKASH KUMAR, Office Asst. 09908787745; GTCM Office : 0866 - 2555687.**

*ప్రత్యేకంగా నన్ను సంప్రతించాలనుకొంటే:* **09848978222, 09494908413. Email : rufus1410@gmail.com**

వచ్చే నెలలో మరోమారు కలసికొనే వరకు ఒకరినిమిత్తం ఒకరం ప్రార్థించుకొందాం.
దేవుని కృప మీకు తోడైయుండి ఆశీర్వదించును గాక.

క్రీస్తులో మీ సహదాసుడు **ప్రియనాథ్ రూఫస్,** ఎక్సేక్యుటివ్ డైరెక్టర్
ఫోన్ : 09494908413, 09848978222 ఈ మెయిల్ : rufus1410@gmail.com
**జి.టి.సి.ఎం. అడ్రస్ :** 11-115, చాపరాల వారి వీధి, అశోక్ నగర్, విజయవాడ-520007. ఫోన్: 0866-2555687.
మేనేజర్: 098660 83001, ఆఫీస్ అసిస్టెంట్: 099087 87745.